# మీనాక్షి శాపం

ఆ రోజు మీనాక్షికి భోజనం సహించలేదు. మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమము వినాలనిపించలేదు. హంస మార్కు వక్కపొడి నమలాలనిపించలేదు. చివరికి బుజ్జిగాడ్ని ముద్దాడాలనిపించలేదు.... ఏమీచెయ్యాలనిపించలేదు. కాని ఏదో చేసెయ్యాలనీ, మనస్సుని సరిపెట్టుకోవాలనీ మీనాక్షికుంది.

మీనాక్షి మంచం మీద వంకరగా పడుకుని వుంది. పాము లాంటి ఆమె శరీరం బుస్సు మంటోంది. మనస్సు కాగిన నూనెలా వుంది. అమృతపాణీ అరటిపండు లాంటి ఆమె ముఖం ఆవకాయలా వుంది. శిరోజాలు చెదరినట్లున్నాయి. వేణీభరం పీచులా వేలాడుతోంది. కళ్లు కత్తిలేని కారంలా మండుతున్నాయి.

విసురుగా లేచికూర్చుంది. మంచం క్రింద ముద్దుగా ఆడుకుంటున్న బుజ్జిగాడ్ని కసిగా చూసింది. విలన్‌లా చూసింది. వాడి కేరింతాలు ఆమె మంటను తగ్గించలేకపోయాయి. 'జెష్ట వెధవ' అనుకుంది.

మీనాక్షికి బుజ్జిగాడిలో రుక్మిణీ అమ్మాళ్ కనిపించింది.

అంతే .... ఎత్తుకోబోయేవాడ్ని దింపేసి చిన్న మొట్టికాయ వేసింది.

తక్షణం మీనాక్షి ఘోరమైన శాపం యిచ్చేస్తూ ... "నేనే పతివ్రతనయితే సీతా, అనసూయా, సావిత్రి అంశలు నాలోవుంటే, ఆ రుక్మిణీ

అమ్మాళ్ పట్టుచీర చిరిగిపోగాక" తన కసి బయట పెట్టింది సత్యభామ మార్కు ఫోజిస్తూ....

ఆ రోజు ముందరి భాగంలో....

మీనాక్షీ నామంతో పిలవబడే ముప్ఫయ్యేళ్ళ ముదిత ముచ్చటగా వంట గదిలో పాకయుద్ధం చేస్తూండగా, బయట కూరలవాడి కేక వినపడింది.

"కూరలవాడేమో చూడండీ" సన్నిగా భర్తని పిల్చింది.

కాని పతి మహాశయుడు శ్రీమాన్ ఆంజనేయులు శ్వేతకాష్టం ఘోరంగా పీలుస్తూ, ఫ్యాక్టరీ గొట్టంలా పొగ ఫ్రీగా వదిలేస్తూ దినపత్రిక చదువుతున్నాడు. మీనాక్షి కేక వినిపించినా, వినపడనట్లు నటిస్తూ "మీనా! మన అప్పలస్వామి వెయ్యి రెండోట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి శఠగోపాన్ని చిత్తుచేసి పడేశాడు." అన్నాడు.

మీనాక్షి లేని సహనాన్ని తెచ్చుకుంటూ, ...."ఆ ఎలక్షన్‌లో మీరే నెగ్గినట్లుంది సంబడంచూస్తే.... సిగ్గులేకపోతేసరి .... నేనేం చెప్పానండీ గుమ్మందాకా వచ్చి దీర్ఘం తీసింది.

ఆంజనేయులు డైలీ చదువుతున్నప్పుడు ఎలాంటి ఆటంకాన్ని సహించలేడు. వాళ్ళ యం. డి. వచ్చినా మాట్లాడడానికి చాయిస్ ఇవ్వడు. అది ఆతడి రూలు.

"మీనా.... కైలాసం డిపాజిట్ గల్లంతు" ఆంజనేయులు నిండా ఎలక్షన్ ఉత్సాహంలో వున్నాడు.

"మీకు పచ్చడి మెతుకులే గతి" విస విస లోపలకి వెళ్ళిపోయింది.

పచ్చడి మెతుకులు మొగుడికి పెట్టినా, తన మాటేమిటి? సరైన కూర లేకపోతే తను తినలేదే?.... ఒక్కక్షణం ఆలోచించి మీనాక్షి పళ్ళెం తీసుకుని పెరటి గుమ్మం ద్వారా వీధిలోకి వచ్చింది.

అప్పటికే కూరలబండి శివయ్య రుక్మిణీ అమ్మాళ్ యింటిదగ్గర వున్నాడు. రుక్మిణీ అమ్మాళ్ వాడితో నవ్వుతూ కబుర్లు చెబుతోంది. మీనాక్షి శివయ్యని లక్ష తిట్లు హడావిడిగా మనసులో తిట్టేసింది. ఈ చవట సందుచివర చిన్న కేక వేసి, ఆవిడగారి గుమ్మం దగ్గరకిపోయి ఆగుతాడు.

ఆ దొరసాని వీడితో చిలకలా మాట్లాడుతుంది. మీనాక్షి మూల్గుతూ బండిదగ్గరకి వచ్చింది.

మీనాక్షి రుక్మిణీ అమ్మాళ్‌ను చూసి ముఖం చిట్లించుకుంది. బాక్సాఫీసు తార ఎక్స్‌ట్రాని చూసినట్లు తిరస్కారంగా చూసింది.

"ఏం శివయ్యా నీ బండి మాయింటి ముందాగదా ఏమిటి?" అంటూ రెండోవైపు నుంచి కూరలు పరీక్షిస్తోంది.

శివయ్య నొచ్చుకున్నాడు.

రుక్మిణీ అమ్మాళ్ మీనాక్షిని చూసింది. ఆమె తిరస్కారాన్ని గమనించింది. కాని ఆమె అంత చప్పున తేలిపోయే మనిషి కాదు. "ఏ.... మం .. డీ వ... దె .. న గారూ వంటయిందా?" లేత ఎండలో తనముఖాన్ని తిప్పుతూ పలకరించింది.

'ఎక్కడండీ' పొడిగా సమాధానం యిచ్చింది.

అర కిలో వంకాయలు తీసుకుని రుక్మిణి అమ్మాళ్ డబ్బులు కోసం లోపలికి వెళ్ళింది.

"ఈ ముష్టి కొనడానికి అరగంట బేరం" లైట్ మ్యూజిక్‌లో వదిలేసింది బాణం.

శివయ్య వ్యాపార ధర్మంగా నవ్వాడు.

ఇక్కడ రుక్మిణీ అమ్మాళ్ గురించీ కొంత చెప్పుకోవాలి. ఆవిడకి ముప్ఫయికి ఏడెనిమిదేళ్ళుంటాయి. అందంగా వుంటుందని ఆమె అభిప్రాయం. గెజిటెడ్ మొగుడూ, చిన్నజీపూ, బ్యాంకు ఎకవుంటూ, కుక్కపిల్లా ఎట్‌సెట్రాలు ఆమె ఎసట్సు. అంచేత ఆ పేటలోని మహిళా జీవాలన్నీ తన శాసనానికి లోబడి వుండాలి, తనకి విధేయత ప్రకటించాలని ఆమె కోరిక. ఇటువంటి వాదాన్ని మీనాక్షి సహించ గలదా ?

జవాబు : సహించలేదు.

మీనాక్షి ఆమెకి ప్రత్యర్థిగా నిలిచింది. మీనాక్షి కూరలతో తిరిగి వస్తుండగా రుక్మిణీ అమ్మాళ్ "ఒక్కసారి యిలా రండి వదినగారూ" సొద

రంగా పిల్చి ఇంట్లోకెవెళ్ళి ఒక ప్యాకెట్ తెచ్చి విప్పి. "ఈవాళ నా పుట్టినరోజండీ ... నిన్నే మావారు తెచ్చారు" అంది.

మీనాక్షి కళ్ళు చెదిరాయి. ఎర్రటి పట్టుచీర. తెల్లటి జరీ అంచు ముచ్చటగా వుంది. ముద్దుగావుంది. ఎంతో బాగుందని మనసులో అనుకుంది. కాని పైకనడం ఎలా?

"రోజూ ఎన్ని చీరలు కొనడం లేదండీ. ఏమిటో.... నేను కట్టిన చీర మళ్ళీ కట్టను. కాని కొంతమంది జాకెట్టు ముక్క కొనుక్కున్నా వీధిన పడతారు. ఛీ. ఛీ... తింగర మనుషులు" ఈసడించి పడేసింది.

మీనాక్షికి నషాళం అంటింది. ఒకసారి టెరెక్స్ జాకెట్‌పీస్ కొని ఆ వీధంతా ఎగ్జిబిట్ చేసింది.

"అవున్లెండి. వదినగారూ! కొంతమందికి కొన్ని కోరికలు తీరక చీర నార అంటూ సంబరపడతారు" రుక్మిణీ అమ్మాళ్‌కి పిల్లలు లేరన్నది దృష్టిలో పెట్టుకుంటూ.

కాని రుక్మిణీ అమ్మాళ్ తన ఓటమి ఒప్పుకొనలేదు. నవ్వుతూ "అంతే లెండి వదినగారూ! మా బాగా చెప్పారు. మూడు పాతికలెట్టి ముచ్చటగా పెళ్ళానికి చీర కొనే మొగుడెవడండీ ఈ వీధిలో ? చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని...." దీర్ఘం తీస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

మీనాక్షి కోపం వరదగోదావరిలా ఉప్పొంగింది. అన్ని భాషల్లో రుక్మిణీ అమ్మాళ్‌ని తిడుతూ బరువుగా యింటికి చేరింది.

తర్వాత వంట ఎలా చేసిందో మీనాక్షికి తెలియదు. చేతికి వచ్చినట్లు వండిపారేసింది. ఆంజనేయులు "కారం"పట్టలేక మంచినీళ్ళు తాగి ఆఫీసుకు పరిగెత్తాడు. ఏవో రెండు మెతుకులు కొరికి రాజ్యం కోల్పోయిన మహారాజులా, కోటా పంచదార కార్డు పారేసుకున్న యన్ జి వో.లా విచారాన్ని ముఖమంతా పులుముకుని మంచం ఎక్కింది.

ఒక్కసారి మీనాక్షిలో ఉత్తేజం ప్రవేశించింది. చీకటిలో వున్న ఆమెకి చిన్న వెలుగు కిరణం కనిపించింది. ఇంతవరకూ పడిన బాధ చిలకలా ఎగిరిపోయింది. బుజ్జిగాడ్ని ముద్దులాడి వంటింట్లోకి పరుగెత్తింది.

భర్తకోసం మినపసున్ని కలిపింది. కాసిని పకోడీలు వేసింది. స్ట్రాంగ్‌గా టీ తయారు చేసింది. తను రెండు నిమిషాల్లో టాయిలెట్ అయిపోయింది. పొరుగింటి పిల్లడిచేత అణా మల్లెపూలు తెప్పించుకుంది. ముసి ముసి నవ్వులు నవ్వుతూ వీధిగుమ్మంలో నిలబడింది.

సరిగ్గా అయిదుముప్ఫయిరెండు నిముషాలుకి ఆంజనేయులు సైకిలు దిగాడు.

మీనాక్షి స్వయంగా మంచినీళ్ళిచ్చి "అయ్యో.... పాపిష్టి దాన్ని.... ప్రొద్దుట అన్నమైనా సరిగ్గా పెట్టలేదు" అని నొచ్చుకుని టవల్. సోపు యిచ్చింది. శంకు లుంగీ యిచ్చింది. ఆంజనేయులుకి అనుమానం, ఆశ్చర్యం కలిగినై.... "తను పద్మవ్యూహంలోకి చొచ్చుకుని పోడంలేదుకదా!" తనే సమాధానం చెప్పుకున్నాడు.... "తను నిమిత్తమాత్రుడు."

మీనాక్షి దగ్గరుండి మొగుడికి మినపసున్ని, పకోడీలు వడ్డించింది. కొసరి కొసరి తినిపించింది. ఆంజనేయులు వద్దాన్నా వినలేదు.

"మీ ఆకలి నాకు తెలియదా? మా సూరంపిన్ని రెండో మనవరాలి పెళ్ళిలో ఎన్ని బూరెలు తిన్నారు.... ఇప్పటికీ అంటుంది మా పిన్ని మీ ఆయన్ని మళ్ళీ తీసుకురావే! బూర్లనోము నోచుకుంటాను."

ఆంజనేయులు స్ట్రాంగ్‌గా నవ్వాడు.

సిగరెట్ పీలుస్తుండగా మీనాక్షి చల్లగా అందుకుంది. "దానికి పొగరెక్కువై పోయిందండీ. దాని మొగుడొక్కడే ఈ లోకంలో ఆఫీసర్ అయినట్లు మాట్లాడుతోంది. మీరు మాత్రం ఏం తక్కువ.... రేపో ఎల్లుండో మీరుమాత్రం మానేజర్ అవరా?...."

అవుతానని ఒప్పుకున్నాడు. ఆంజనేయులు.

మీనాక్షి సంతోషించి "మనం దానికి బుద్ధి చెప్పాలి. మూడు పాతికలెట్టి చీరకొనే మొగుళ్ళున్నారని నిరూపిద్దాం" అంది.

"ఎలా?" ఆంజనేయులకర్థం కాలేదు.

"ఇంత చిన్న విషయం తెలియదుటండి.... అందుకే మీకు ప్రమోషన్ రావడంలేదు." మీనాక్షి చెవిలో చెప్పేసింది రహస్యంగా.

ఆంజనేయులు ఆవదం తాగినట్లయి పోయాడు. ఎన్నో సందేహాలు సమస్యలు ఆతడ్ని కంగారు పెట్టేసినయి. "మరి ...మరి...."

"ఇంకేం చెప్పకండి. ఈనెల్లో బోనస్ వస్తుంది కదా!" పరిష్కరించి పారేసింది.

"మినపసున్ని మాయ" కసిగా లోపల మాత్రం అనుకున్నాడు.

o o o

బోనస్ రాగానే ఎనిమిది పదులు పెళ్ళాని కిచ్చాడు. ఏకైక పిల్లడ్ని విధిలేక దత్తుకిస్తున్న తండ్రిలా కృంగిపోయాడు. మనసులో కురుస్తున్న విషాదాన్ని దాచేసి "మీనూ! ఆ చీర నువ్వు తప్పని సరిగా కొనాలి. ఆ చీరలో నీ అందం వర్ణించడం కాళిదాసు తరమా ?" మెచ్చుకున్నాడు తన గౌరవమైనా దక్కించుకుందామని.

భర్త ఔదార్యానికి ముగ్ధురాలయింది. సినిమాలో పతివ్రతలా భర్త కాళ్ళ మీద పడిపోయింది. "జన్మ జన్మలకీ మీరే నా ప్రాణనాధులు."

ఆ సాయంత్రం పంచాంగం తీసి ముహూర్తం గుణించింది. చీర మర్నాడు సాయంత్రం ఆరుగంటల యిరవై ఏడు నిముషాలకి కొనాలి. మీనాక్షికి పంచాంగంపై వెర్రినమ్మకం.

మీనాక్షి పట్టుచీర కొంటుందన్న వార్త ఆమె అంతరంగికులకు తెల్సిపోయింది. ముందర వాళ్ళు విలపించారు. ఈర్ష్యతో మూలిగారు. కాని తప్పదు. ఇద్దరూ వెంటనే పరుగెత్తుకొచ్చారు.

"అత్తయ్యా! నువ్వా పట్టుచీర కొనాలి. ఆ రుక్మిణీ అమ్మాళ్ పొగరు తగ్గాలి. నీకు మాత్రం ఏం తక్కువ ?" అంది సర్వలక్ష్మి. ఆమెకి పాతికేళ్ళుంటాయి. అందాన్ని పొందడం ఎలా ? అన్న విషయం మీద మీనాక్షి దగ్గర ట్రయినింగ్ అవుతోంది.

సర్వలక్ష్మి అంత యిదిగా పొగడటం సర్వకుమారి కిష్టం లేక పోయింది. ముందుగా ఆమె పొగడటం ముళ్ళమీద నడిచినట్లుంది. ఆమె

పొగడ్తకి మీనాక్షి ఎక్కడ ఉబ్బిపోయి తనని నిర్లక్ష్యం చేస్తుందనో ఆ పిల్ల భయం.

"అక్కా! ఆ పట్టుచీరలో నువ్వూ, బావా ఒక ఫోటోదిగి నా కియ్యి. కలకాలం పూజించు కుంటాను" తను సర్వలక్ష్మికంటె బాగా పొగిడానని సంతోషించింది. మనసులో మాత్రం అసహ్యపడింది. "ఛీ.... ఈ సన్యాసిని నా పూజ చేయటం" నాలికమీది మాటలే కదాని తృప్తిపడింది అసలు నర్సకుమారి మీనాక్షి శిష్యరికం చేయడంలో ఓ స్వార్థముంది. ఆమె హృదయేశ్వరుడికి అన్ని వ్యసనాలు వున్నయి. ఒక్క పెళ్లాం మీద తప్ప అన్నిటమీద ప్రేమవుంది. ఇంట్లోకి పైస యివ్వకపోయినా అన్ని మర్యాదలు జరగాలి. అందుచేత నర్సకుమారి వీలైనంత అప్పులుచేసి సంసారం పోషిస్తున్నది. రుక్మిణీ అమ్మాళ్‌కి మీనాక్షికీ మధ్యనున్న పొరలేవో యిట్టే కనిపెట్టేసింది.

ఇద్దరి కోరికలు తీరుస్తానని వాగ్దానం చేసింది.

మర్నాడు సాయంత్రం మీనాక్షి సర్వలక్ష్మి, నర్సకుమారి సమేతంగా బజారుకు బయలు దేరింది.

ఇటు సర్వలక్ష్మి, అటు నర్సకుమారి నడుస్తూ మీనాక్షిని పొగిడి పారేస్తున్నారు.

ప్లాస్టరాఫ్ పారిస్ బొమ్మలతో, రంగు రంగుల దీపాలతో వెలిగే దగాచంద్ కొట్టుమూసి వుంది.

మీనాక్షి నాడి పలచబడింది.

"అక్కా! ఆ దగాచంద్ కుటుంబంతో సహా వాళ్ళ దేశం పెళ్ళికి వెళ్ళాడుట ... పది రోజులదాకా కొట్టు తీయరట" నర్సకుమారి ప్రక్క షాపులో అడిగి వేగిరం "టెలిగ్రాం"లా వచ్చేసింది.

మూడు లక్షలతో ముచ్చటగా తీసిన పిక్చర్ మూడురోజులు ఆడకుండా ఫ్లాపైన ప్రొడ్యూసర్‌లా డీలాపడి పోయింది మీనాక్షి. "ఎవర్నో పెట్టి వెళ్ళచ్చుగదా .... కొడుకులున్నారుకదా!"

సర్వలక్ష్మికి ఛాన్సు వచ్చింది "నీకు తెలియదత్తయ్యా.... దగా

చంద్ కొడుకుల్లో అన్నీ సుగుణాలే.... వాళ్ళకి పెత్తనమిస్తే దగాచంద్ దివాళాయే ... మన సర్వకుమారి మొగుడే యింకా జూనియర్." వెటకారంగా చూసింది సర్వకుమారి కోసం.

పదిమందిలో భర్తని అవమానిస్తే పతివ్రతకు కోపంరాదూ! "గురివింద సామెత మరచిపోకు! నీ అందాన్ని భరించలేకే కదే నీ మొగుడు రాత్రి భోగం వీధిలో తిరుగుతున్నాడు."

తనింత కష్టములో వుండగా వీళ్ళిలా కొట్టుకోవడం మీనాక్షికి నచ్చలేదు. ఇద్దర్నీ గదమాయించింది. "చాలిక."

అప్పటికి ట్రాఫిక్ పోలీసు, చిన్నగుంపు వాళ్ళ ముందుకు వచ్చారు. మీనాక్షి ఏమీలేదని సర్దడానికి అరగంట పట్టింది. అర్ధరూపాయిలో అంతా నమ్మేసి, "ట్రాఫిక్ న్యూసెన్సు చెయ్యకూడదని" సెలవిచ్చి పోలీస్ కదిలాడు.

మీనాక్షికి తల కొట్టేసినట్టయింది. సర్వలక్షి, సర్వకుమారి భయం భయంగా నిలబడ్డారు. నోటికి పక్షవాతం వచ్చినట్లయింది యిద్దరికీ.

మీనాక్షి యింటికి వచ్చేసింది.

o o o

సర్వలక్ష్మి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లా వచ్చేసింది. గ్లాసుడు మంచి నీళ్ళు అడిగి తాగింది. రవంత విశ్రాంతి పొంది "అత్తయ్యా! శుభవార్త" అంది.

"ఏమిటి? రుక్మిణీ అమ్మాళ్ కేమయినా...." మీనాక్షి ఆలోచన లంతకుమించి పోవు.

"కాదు. పట్టుచీరలు మహేంద్రా ఎంపోరియం కి రాత్రే వచ్చాయట ......"

మీనాక్షి మనసు కుదటపడింది.

"అయితే నడు. ఈవాళే తెచ్చేద్దాం, ఆలస్యమైనకొద్దీ స్టాకు అయి పోవచ్చు"

"మరి మంచిరోజే యివాళ...."

"ఆ... పంచమి రెండున్నరదాక మిగిలివుంది."

మీనాక్షి రెండు క్షణాల్లో తయారయింది. అంతదాకా నిద్రపోతున్న బుజ్జిగాడు లేచాడు. తల్లి ఎక్కడికో ప్రయాణమైందని తెలచాడు. వెంటనే భూపాలరాగం అందుకున్నాడు.

బిస్కట్లు, బొమ్మలు అన్నీ వృధా అయినాయి. తల్లి ఊరుకోబెట్టే కొద్దీ రెట్టింపు వేగంతో ఏడ్చి తన పౌరుషాన్ని నిలబెట్టుకుంటున్నాడు.

"వాడ్నికూడా తీసుకురా ...." నోరు జారింది సర్వలక్ష్మి.

మీనాక్షి ఉరిమి చూసింది. పిల్లడ్ని ఎక్కడికయినా తీసుకెళ్ళడం మీనాక్షికి చిరాకు. జనం తన వయస్సు ఎక్కువగా అంచనా వేస్తారని ఆమె భయం.

"కుమారి యింటిదగ్గరుందేమో చూడు" అంటూ సర్వలక్ష్మిని పంపింది. అడ్రసు సరిగ్గాలేని ఉత్తరంలా వెంటనే వచ్చింది. "ఆవిడ బజారులో ఊరేగుతున్నది అత్తయ్యా" అంటూ.

మీనాక్షికి కంపరం ఎత్తిపోయింది. బుజ్జిగాడు తన రాగం మానలేదు ఏమయింది వెధవకి, జీడిలాపట్టుకున్నాడు. ఏ దయ్యమైనా పట్టుకోలేదుకదా!

"పోన్లే అత్తయ్యా .... సాయంత్రం పోదాం."

వాయిదా మీనాక్షికి సుతరాం యిష్టంలేదు.

కసిగా రెండు వడ్డించింది కొడుకుని .... అబ్బే వాడు ఆరంభ శూరుడు కానని నిరూపిస్తూ, వెయ్యి బాజాల ధ్వనిక రాగం పెంచాడు.

అంతే ! ఇరుగుపొరుగు మూగిపోయారు.

"ఏమయింది పిల్లాడికి ? పడ్డాడా ?"

"ఏ పురుగయినా కుట్టిందా ?"

"గాలేమో చూడండి !"

"వాతం కమ్మలేదు కదా !"

రకరకాలుగా వ్యాఖ్యానిస్తూ అమ్మలక్కలు వచ్చేశారు.

మీనాక్షి ఏం లేదండి, నిద్రలేచి ఏడుస్తున్నాడండి. వాడికది అల వాటే అంది. కాస్సేపు ఏడ్చి ఏడ్చి వాడే వూరుకుంటాడంది.

అమ్మలక్కలు నిరుత్సాహం చెందారు.

ఇంకా బుజ్జిగాడు సన్నగా కుంయ్ మంటున్నాడు.

పిల్లాడ్ని సర్వలక్ష్మికిచ్చి ఎదుటి వీధిలోని పోస్టాఫీసుకి బయలుదేరి రింగప్ చేసి "హలో" అంది.

"హలో .... ఎవరుకావాలి" మేనేజరు కంఠం వినిపించింది.

"నమస్కారం బాబయ్యగారూ .. వార్ని ఒక్కసారి పిలుస్తారా.... పిల్లడికి రొంపవాతం కమ్మినయి .... డాక్టరు కోసం వెళ్లేవాళ్లే లేరు"

"ఆంజనేయులు మంచి వర్క్ లో ఉన్నాడమ్మా.... నేనే పిలుచుకు వస్తాలే.... కుర్రసన్నాసి అతడేం చేస్తాడు?"

వెలగపండు అడ్డంపడింది. ఆత్రంగా "వద్దు బాబయ్యగారు. పెద్ద వారు మీకుశ్రమ.... ఎండలో నడిస్తే మీకు బి. పి ఎక్కువై పోతుంది. ఆయన్నే పంపండి"

మీనాక్షి వచ్చిన పది నిముషాల్లో ఇంటిముందు కారాగింది. ఆంజనేయులు ఆత్రంగానూ, చైల్డ్ స్పెషలిష్టు బాలరాజు ఠీవిగానూ దిగారు.

"మీనా! ఏడి బాబు" ఆంజనేయులు కంగారుగా గదిలోకి వచ్చాడు.

బాలరాజు హాల్లో కూర్చున్నాడు. అతడు ప్రాక్టీసు పెట్టిన అర్థసంవత్స రానికి యిదే తొలికేసు. వణుకుని బలవంతంగా ఆపుకుంటూ .... "వెంటనే బాబుని తీసుకురండి. కేసు కాంప్లికేటెడ్ అయిపోతే కష్టం .... మా లాంటి స్పెషలిష్టువుంటే ఫరవాలేదనుకోండి. అవసరమైతే సర్జరీ చేసేస్తా" కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ డబ్బా వాయించసాగాడు.

"మీరన్నీ యిలాంటి పనులేనండీ ........" మీనాక్షి కళ్లెగరే స్తోంది.

"నోర్మూయ్ యిక. మా మేనేజరుగార్ని పిలిచి చెప్పావు కదటా.... ఆయన బావమరిదిని రప్పించాడు...."

సర్వలక్ష్మి సన్నగా నవ్వుకుంటోంది.

ఆంజనేయులు మూడయిదులు బాలరాజు చేతిలో పెట్టి "క్షమించండి డాక్టరుగారూ। ఆడవాళ్ళు తెలుగుమందు పేయించారు. బాబు నిద్రపోతున్నా" డన్నాడు.

బాలరాజు కంగారు తగ్గింది. "ఆల్‌రైట్. డోంట్ వర్రీ. ఐ ఎక్స్‌పెక్ట్ యువర్ కాల్ ఎగైన్" అంటూ ఫ్రీగా ఓ నవ్వు విసిరి కారెక్కాడు.

ఆంజనేయులు కత్తి పోగొట్టుకున్న జానపద సినిమా హీరోలా గంతు లెయ్య సాగాడు.

మీనాక్షి వెంటనే స్ట్రాంగ్ కాఫీచేసి భర్తకిచ్చి "నన్ను క్షమించరూ" అంది గోముగా, ఓ రొమాంటిక్ ఫోజు విసిరి.

ఆంజనేయులు చిత్తయిపోయాడు.

మీనాక్షి అవకాశాన్ని జారవిడుచుకోలేదు. బుజ్జిగాడి బాధ్యత ఇంటిభారం ఆంజనేయుల కప్పగించి సర్వలక్ష్మితో రిక్షా ఎక్కింది.

సందుచివర సర్వకుమారి ఎదురయింది. ఆమె రెండు చేతుల్లోనూ సరకుల సంచులు వున్నాయి. "ఎక్కడికి" ఆత్రంగా అడిగేసింది.

"పిచ్చాసుపత్రికి.... వస్తాను" సర్వలక్ష్మి వెటకారం విసిరింది.

"ముందు నీవు పోయిరా" అంటూ కదిలింది. మీనాక్షి ఆగ మంటున్నా వినలేదు. ఆ పిల్లకి ఉక్రోషం ఆగలేదు. తనకి ఘోరమైన అన్యాయం జరిగినట్లు వాపోయింది. మీనాక్షికి సర్వలక్షి తనపై చెప్పే చాడీలన్నీ ఊహించుకుంది.

"కుమారంటే నీకెందుకంత కోపం" అంది మీనాక్షి.

వడ్డీవ్యాపారి చిరునవ్వులా భయంకరంగా వుంది ఎండ. క్రయిమ్ పిక్చర్‌లో విలన్‌లా నవ్వుతోంది వేడిగాలి. స్వేదబిందువులు చిన్న ముత్యాల్లా వెలుగుతున్నాయి.

‘ధాం’ అంది దీపావళి చప్పుడుతో రిక్షాటైరు.

"సీ…." అంటూ బండబూతు తిడుతూ దిగాడు.

అర్ధరూపాయి విసిరేసి రిక్షా దిగారు. ఇద్దరూ నడక ప్రారంభించారు. ఎక్కడా రిక్షా కన్పించడంలేదు. ఇంకా అరమైలు నడవాలాయె అయిదు నిముషాల్లో కొరివి కారంలా తయారయినయి యిద్దరి ముఖాలూ....

"ఆ నర్సుకుమారి శకునం చూశావా?" చిరాగ్గా అడిగింది సర్వలక్ష్మి.

భారంగా తలూపి: "ఒక గొప్పపని కోసం మనం ఎంతయినా త్యాగం చెయ్యాలి లక్ష్మి. మనకున్న నేర్పు, ఓర్పు యిప్పుడే అక్కరకొస్తాయి. దమయంతి నలుడ్ని పెళ్లాడానికి ఎంత కష్టపడింది? రుక్మిణీ కృష్ణుడ్ని పొందడానికెన్ని తిప్పలు పడింది" వగైరా ఉపమానాలు చెప్పి ఊరించింది.

"మహేంద్రా క్లాత్ ఎంపోరియం" అన్నబోర్డు చూడగానే యిద్దరి ప్రాణాలు కుదుట పడినై

సేల్సుమన్ యిద్దర్నీ సాదరంగా ఆహ్వానించాడు. కూల్ వాటర్ యిచ్చి సత్కరించి "ఏమిటి సెలవన్నట్లు" చూశాడు.

"…. … ఉన్నాయా?"

పట్టుచీరలు ప్రభల్లా కింద పడ్డాయి. రంగు రంగుల తోరణాల్లా కన్పించాయి. ఏది కొనాలో అర్ధంకాలేదు.

సర్వలక్ష్మి రుక్మిణీ అమ్మాళ్ డిజైన్ చీరతీసింది. "ఎంత."

సేల్సుమన్ నవ్వి ఇంగ్లీషులో "నైంటీసిక్స్ రుపీస్" అన్నాడు.

"ఆ దగాచంద్ డెబ్బయి అయిదుకే యిచ్చాడుగా."

"మేమూ యిచ్చామండీ. కాని డిమాండ్ ఎక్కువయి పోయింది, సప్లయి తగ్గిపోయింది. 'ధర' పెరిగింది" బియ్యే మూడుసార్లు తప్పిన సేల్సుమన్ ఎకనామిక్స్ ఎత్తాడు.

మీనాక్షిదగ్గర డెబ్బై యెనిమిది వుంది. పోనీ తక్కువరకం చీర కొందామనుకుంది. మనస్సు ఒప్పుకోలేదు. భర్తనడిగితే లేదనవచ్చు. అన్నీ

అటంకాలే ఎదురవ్వచ్చు. సర్వలక్ష్మితో యిప్పుడే వస్తానని చెప్పి బయటకు వచ్చింది.

వేలినున్న ఉంగరంతీసి "ధర్మకాటా"లో యిచ్చింది.

"పచ్చీస్ రూపయా దేనా" అన్నాడు షరాబు.

అవసరం మరి!

తిరిగి వస్తుండగా సర్వలక్ష్మికి "మా ఫ్రెండుకు ఫోన్ చేశాను. నౌకర్నిచ్చి సాదరంగా పంపింది. పిచ్చిమొద్దు నేనంటే దానికి ప్రాణం" అని చెప్పింది.

నేను నమ్మతానా అన్నట్లు — చూసింది సర్వలక్ష్మి.

* * *

రాత్రి ఎనిమిదింటిదాకా మీనాక్షి ఇల్లు ఎగ్జిబిషన్ అయింది. అందరూ చీర బాగుందంటూ మెచ్చుకున్నారు.

ఆంజనేయులు కూడా విధిలేక "మీనా! నీ సెలక్షను వేరే చెప్పాలా? వెరీగుడ్" అంటూ అన్ని భాషల్లోను మెచ్చుకున్నాడు.

మీనాక్షి తన జీవితం ధన్యత చెందినట్లు భావించింది. నూర్రోజు లాడిన సినిమా ప్రొడ్యూసర్‌లా పులకరించి పోయింది. లంకెబిందెలు దొరికినంత సంతోషపడింది.

ఈ వార్తలన్నీ రుక్మిణీ అమ్మాళ్‌కి తెలుస్తూనే వున్నాయి. కొ__గా సారాత్రాగిన వాడిలా గంతులెయ్య సాగింది. నర్సకుమారి అక్కడికిపోయి చిలవలు పలవలు పెట్టి చెప్పింది. మధ్యాహ్నం అవమానం ఆమెను దహించేస్తోంది.

"చూస్తా, ఒక గుమాస్తా పెళ్లాం మాతో పోటీకి రావడమా? దానికెన్ని గుండెలు? అప్పోసప్పోచేసి ఓచీర కొనడం ఘనకార్యమా? రేపు దగాచంద్ రాగానే అయిదారు రకాలు తీయించి పడేస్తాను" ప్రతిజ్ఞ చేసింది.

నర్సకుమారి అందుకుంది. "అలాగే చెయ్యండి. అప్పుడుకాని తిమ్మిరి అణగదు. ఏనుగుని ఎలక ఢీకొనడమా?"

"నలిపి పడేస్తాను. అప్పుడు రమ్మను పోటీకి." అరగంటదాకా మీనాక్షిని పొడిచేస్తూనే వుంది. నర్సకుమారి ఎగదోసేది. ఈ అవకాశాన్ని ఆమె పుష్కలంగా ఉపయోగించుకుంది. నేను మీ వర్గంలో మనిషినే. కేవలం రహస్యాలు తెల్సుకుందుకు పైకటు వున్నాను" అంది. తనపై విశ్వాస ముంచాలంది.

"తప్పకుండా" అభయం యిచ్చింది.

నర్సకుమారికి తనకు కావలసిన అర కిలో బియ్యం, పుంజీ మిరపకాయలు, రెండు నిమ్మకాయలు అడుక్కొని వెళ్ళింది. రుక్మిణీ అమ్మాళ్ అంతగా యివ్వడానికిష్టంలేక పోయింది. ఎందుకంటె అవి తిరిగిరావు. కాని గూఢచారి ఖర్చులు.

నర్సకుమారి యింటికి పోయేసరికి కరివేపాకు, రెండు పచ్చిమిరపకాయలు కావలసిన అవసరం కనబడగా మీనాక్షి యింటికి వచ్చి, "చూశావా అక్కా.... ఆ రుక్మిణీ అమ్మాళ్ ఎంత ఏడుస్తుందో" అంటూ ప్రేమ వలకపోసింది.

"అలా అందా?" మీనాక్షి కళ్లెర్రచేసింది.

"నేను వినలేక పోయానక్కా. మనిషికంత ఈర్ష్య పనికిరాదు. ఎలకలా వుంటుంది. తాటిపీచు లాంటి జుట్టు. ఎంత మంచి చీర కడితేనేం అందమా చందమా? నువ్వే చీర కట్టినా ఆదిలక్ష్మిలా వుంటావు." అని అరగంట గాత్రంపాడి అప్పు తీసుకుని సెలవు తీసుకుంది.

ఆ రాత్రి మీనాక్షికి అన్నం సహించలేదు. మనస్సు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయి పోతోంది. ఎల్లుండి సప్తమీ లక్ష్మివారం హాయిగా పట్టుచీర కట్టుకుని మందిర బీచ్‌కి, తర్వాత సినిమాకి.... రుక్షిణీ అమ్మాళ్ కుళ్లి చస్తుంది.

ఆమె చెప్పిన ప్లానుకు ఆంజనేయులు ఒప్పుకున్నాడు "రెడీ."

రెండు రోజులు సరిగా నిద్ర పట్టలేదు. తను పట్టుచీర కట్టుకున్నట్లు ఏవేవో లోకాల్లో విహరించినట్లు టెక్నికలర్ కలలుకంది. ఇంత మంచి చీర తయారుచేసిన టెక్స్టయిల్ కంపెనీకి, అమ్మిన మహేంద్రా క్లాత్ ఎంపోరియం వాళ్లకీ హృదయపూర్వకమైన ధన్యవాదాలర్పించింది.

గురువారం నాడు ఓ గంట పర్మిషన్ తీసుకుని ముందుగానే అంజనేయులు యింటికి వచ్చాడు. కాని మీనాక్షి తయారైనట్లు అగుపడలేదు.

గా మీనాక్షి వసారాలో చాపా, చెంబుతో సిద్ధంగా వుంది. బుజ్జిగాడు మట్టిలో ఆడుకుంటున్నాడు.

మంత్రయిన నాలుగు రోజులకే బలవంతంగా దింపేసిన రాజకీయ నాయకుడిలా గొల్లుమన్నాడు అంజనేయులు.

"ఏం....చేస్తాం....చెప్పండి."

"మంచీ .... చెడ్డా .... అంటే అలాగే వుంటుంది మీనాక్షి" అజంనేయులు పెళ్లాం తప్పు వేలెత్తి చూపించాడు.

"మూడ్రోజులే కదా .... లేచి కాఫీ పెట్టండి." కర్తవ్యాన్ని గుర్తు చేసింది మీనాక్షి.

o o o

మీనాక్షి ద్వితీయ వస్త్రధారణ మహోత్సవం కొద్ది క్షణాల్లో ప్రారంభించవలసియుండగా అనుకోని అవాంతరం వచ్చిపడింది.

రెండు కాటా బస్తాల బరువు, నల్లగా రూపాంతరం చెందిన తెల్ల నైను పంచి, ఎడం చేతిలో కలకత్తా గోనిసంచి, కుడిచేతిలో కంచు మర చెంబు సమేతంగా పాపమ్మ రిక్షా దిగింది.

మీనాక్షి గుండె గుబేల్ మంది. కారణం అవిడ కళ్ళు నోరు, చేతులు ప్రత్యేకమైన మహాత్యంకలవి. అంజనేయులుకామె స్వయాన పినతల్లి. అన్నెల్లకో సారయినా బంధు మిత్ర పరామార్శ చేయందే ఆవిడ నిద్ర

పోలేదు. ఎక్కినగుమ్మంలో తనకు లభించే వసతులని బట్టి ఆవిడ వుండే రోజులు పొడిగింపబడతాయి.

"రండత్తయ్యా"

పాపమ్మ తన సామాను లోపలిగదిలో భద్రపరచుకుని హాల్లోకివచ్చి మీనాక్షిని పరిశీలనగా చూసి "మళ్ళీ నీళ్లోసుకున్నావుటే" భళ్లున నవ్వి పెళ్ళున మంచంపై వాలింది.

"నేను రోజూ పోసుకుంటాలెండత్తయ్యా" పాపమ్మ రావడం ఏ మాత్రం ఇష్టంలేదన్నట్లు చూపులు విసిరి లోపలికి వెళ్లింది.

కాని పాపమ్మ కలాంటివి లెక్కలేదు. దూషణ భూషణలు ఒకలాగే తీసుకుంటుంది. "అమ్మాయ్! మీనా కాస్త పిండి కలియపెట్టమ్మా. వెధవ ప్రయాణంలో వళ్ళు కదిలిబోయింది. ముందర కాస్త కాఫీనీళ్ళు పడేయ్" మీనాక్షి మరచి పోయిన అతిథి ధర్మాన్ని గుర్తుతెచ్చింది.

మీనాక్షి తనపట్టుచీర, ముఖ్యమైన విలువైన సామాను బీరువాలో పెట్టి తాళం వేసింది. హాల్లో వున్న అలారం టైంపీసు కూడా దాచేసింది. పాపమ్మ తన కలవాటయినట్లు చూసి "అంజిగాడేడే, అమ్మాయ్" అడిగింది.

"ఆఫీసులో వుంటారు ...ఆయన్ని అర్జంటుగా కల్సుకుని వెళ్ళిపోతారా. పక్కింటి పిల్లాడ్ని పంపుతాను" మనసులో రగులుతున్నది బయట పెట్టింది.

అనవసరంగా నోరు జారానే అనుకుని అంతలోనే సర్దుకుంది. "అంత పని నాకేంవుందే... రానీ! ఏలాగూ పది రోజులుండేదాన్నే"

మీనాక్షికి టెంపరేచర్ తగిలింది.

ఆంజనేయులు రాగానే పిన్నినిచూసి మహా ఆనందపడ్డాడు. 'పిన్నీ' అంటూ కౌగలించుకున్నంతపని చేశాడు. అతడి ఆనందం వేరు. అతని కెన్నాళ్ళనుంచో కందాబచ్చలి తినాలని వుంది. మీనాక్షి అలాంటి కూరలు ఎప్పుడూ వండదు. ఆమెకి తేలికగా అయిపోయేవంటలే కావాలి.

"ఎంత చిక్కిపోయావురా పిచ్చి తండ్రీ" పాపమ్మ ప్రేమ వర్షించింది. నువ్వు నవనవ లాడేదాకా వెళ్ళనే వెళ్ళను అనుకుంది లోపల.

రాత్రి పడుకోబోయేముందు అంజనేయులు "ఏం మీనా! పట్టుచీర కట్టుకోలేదేం?" అనడిగాడు.

"వచ్చిందిగా మీ పిన్ని" వ్యంగ్యం విసిరింది..

"వస్తే"

"అన్నీమీకు కొత్తే. ఆ పాపిష్టి కళ్లు పడితే ఏమైన వుందా?"

"పూర్ సెంటిమెంట్స్"

"మీకలాగే వుంటుంది. క్రితంసారి చుక్కలచీర కట్టుకున్నాను. మీ పిన్నిగారు దీవించారు, పదిలంఖనాలు చేశాను."

అంజనేయులేం మాట్లాడలేదు.

పాపమ్మ వచ్చి నాలుగురోజులైంది. పిండి వంటలూ గట్రా వండి పారేస్తోంది. మీనాక్షి ఎన్ని సూటీపోటీ మాటలన్నా నవ్వేసి 'అనవే పిల్లా' అని ఉత్సాహపరచేది. మొండివాడు రాజు కంటె బలవంతుడు కదా! మీనాక్షేం చేస్తుంది? పోనీ తిని కూర్చుంటుందా.... అంటే అదీ లేదు. అన్నిళ్లూ ప్రదక్షిణంచేసి వస్తుంది. వాళ్లు పరాకుగా వుంటే చిన్న వస్తువు లేవయినా వుంటే పంచెలో పడేసి తెచ్చేసి గోనెసంచిలో దాస్తుంది. సర్వలక్ష్మి ఇంట్లో నుంచి నీళ్ళు త్రాగి ఆమె లోపలికి వెళ్ళగానే గ్లాసు తెచ్చేయ బోయింది. సర్వలక్ష్మి గుర్తు చేసింది.

"మరచిపోయానే పిల్లా! వయసు వచ్చి పడుతోంది" ఆ తప్పంతా వయసుకి అంట గట్టి వచ్చేసింది పాపమ్మ.

మరో ఘోరమైన పనికూడ చేసింది. మీనాక్షి తక్కిన వాటిని క్షమించగలిగినా.... దాన్ని క్షమించలేక పోయింది.

పాపమ్మ రుక్మిణీ అమ్మాళ్ గడపకూడ ఎక్కింది. ఆవిడ పెట్టిన అరటిపళ్లు, మామిడిపళ్లు తిని మీనాక్షిమీద లెక్క లేనన్ని చాడీలు చెప్పి వచ్చింది.

మీనాక్షి వాళ్ళ వంశం మంచిదికాదండి. ఎరక్క గోతిలో పడ్డామండి. ఇదంతా మా ఆంజనేయులు దురదృష్టమండి. మీమీద అది కత్తిగట్టడం బుద్ధిలేని పనండి. మీ మంచితనానికి కాలమానాలు లేవండి.

రుక్మిణీ అమ్మాళ్ సంతోషించింది.

ఇవన్నీ మీనాక్షికి తెల్సాయి. ఆటంబాంబులా ప్రేలింది. "నా యింట్లో పడి తింటూ నన్నే వీధిని ఎక్కిస్తావా? అసలు ఎవరు పిల్చారని వచ్చావ్? నీకూ మాకూ చుట్టరికం ఎక్కడా? అదెట్టిన అరటి పళ్ళతో లేనిపోనివి వాగుతావా? నీ దొంగ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు?"

పాపమ్మ అన్నీ ఒప్పుకుంది. "పెద్ద ముండనే..."

మీనాక్షి పాపమ్మ సామాను వీధిలో పెట్టింది. "ఏడింటికి రైలు వుంది. దాంట్లో పో... మళ్ళీ గుమ్మం ఎక్కక?"

"ఒరేయ్.... అంజీ.... చీకట్లో ఎక్కడికి పోన్రా" దీర్ఘాలు తీసింది.

ఆంజనేయులు మాట్లాడలేదు.

"ఆయన చెప్పేదేంలేదు.... నడువిక.... మళ్ళీ రైలందదు."

"డబ్బుల్లేవే పిల్లా" ఆఖరి ఆయుధం ప్రయోగించింది.

కాని మీనాక్షి మెత్తబడలేదు. "ఆ కలకత్తా గోనిసంచి విప్పితే కనకవర్షం కురుస్తుంది. పోనీ నన్ను తియ్యమంటావా?"

పాపమ్మ రాంబాణంలా కదిలింది. 'దీన్ని సాగదీస్తే సంచీ విప్పేలాగే వుంది.' అనుకుంటూ చిన్నగా మూల్గి "వస్తానురా అబ్బి.... పిల్లాడు జాగ్రత్త.... ఈ సారి వచ్చేటప్పుడు వాడికో వెండిగిన్ని తెస్తాను. వస్తానే అమ్మాయ్.'

ఏమీ జరగనట్లు అతి సామన్యంగా అందరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయింది పాపమ్మ. ఇలాంటివి ఎన్ని చూసిందో!

"వదిలింది పీడ" మీనాక్షి సంతోషించింది. అంత అమర్యాద పూర్వకంగా పిన్ని వెళ్ళిపోడం ఆంజనేయులి కేమాత్రం యిష్టంలేక పోయింది. కాని అతడు దాన్ని తేలిపోనీలేదు. మరో గాలి వాన అతడు భరించే దశలో లేడు.

మర్నాడు సాయంత్రం ఆంజనేయులు హడావిడిగా లోపలికివచ్చాడు. మీనాక్షి టాయిలెట్ అవుతోంది. ఎర్రటి పట్టుచీర మంచం మీద రక్తం ముద్దలా పడివుంది.

"ఓ పెందరాళే వచ్చారే .... ముఖం కడుక్కోండి.... టిఫిన్ తెస్తాను....గుళ్ళోకి వెళ్ళివద్దాం" మీనాక్షి జడల్లుకుంటూ అంది.

ఆంజనేయులు నీరసంగా కూర్చున్నాడు

"మీనా.... ప్రొద్దుట్నుంచి తిరిగినా పైసా అప్పుదొరకలేదు. రాత్రే యం.డి. గారమ్మాయి పెళ్ళి"

మీనాక్షి వెనక్కి తిరిగింది.

"ఏం పట్టు కెళ్లకపోతే

"ఎలా? బాగుండదు"

ఒక్క క్షణం ఆగి ఈ పట్టు చీర యింకా ప్రారంభోత్సవం చెయ్యలేదు. కనుక దీన్ని చదివిస్తాను. రేపు షష్టికి చీర కొనే బాధ్యత నాది' పాఠం గణ గణా అప్పగించేశాడు.

మీనాక్షి ఘ్రాన్పడి పోయింది.

ఇదే సమయమని చీర పాక్ చేసి ఆంజనేయులు కంగారుగా బయటకి వెళ్ళిపోయాడు.

నర్సకుమారి తొందర తొందరగా వచ్చి "అక్కా ... శుభవార్త ... ఆ రుక్మిణీ అమ్మాళ్ పట్టు చీరని వాళ్ళ కుక్క చింపేసింద" అని చెప్పింది.

మీనాక్షిలో సంతోషరేఖలు వెలిశాయి.

*
* *